

# లక్ష్మి ఇల్లు

***"ఓయమ్మ! తొందరగ బాసన్లేయి, నేను ఇయ్యాల జల్ది పోవాల్న"- పెద్దగా కేకలు వేసుకుంటూ పనిమనిషి లక్ష్మి బయట తలుపు దఢేల్‌మని తీసుకుంటూ వచ్చింది.***

***"వస్తే చాలు ఊపిరాడనివ్వవు కదా! చీఫ్ మినిస్టర్ కంటే బిజీ అయిపోయావు. ఎక్కడికి పోవాలి తల్లీ ఇవాళ," అంట్ల గిన్నెలేస్తూ అడిగింది జానకి.***

"ఎంప్లాయిమెంట్‌లో కార్డు రెన్యూల్ అంట. అది జేయించుకోవాల్న, ఇల్లు మాపటికొచ్చి తుడస్త. నీకిబ్బందయితదని బాసన్లు తోమిచ్చిపోదమని వచ్చిన"- ఎడాపెడా అంట్లు తోముతూ అంది లక్ష్మి.

త్వరగా పని ముగించుకుని వెళ్ళిపోయింది లక్ష్మి.

చెప్పినట్లే సాయంత్రం ఐదుగంటలవుతుండగా వచ్చింది. సావధానంగా ఇల్లు ఊడ్చి తుడుస్తుండగా జానకి టీచేసి ఇచ్చింది.

"వేడి చల్లారకముందే తాగు. ఇల్లు తర్వాత తుడుద్దువు గాని. అయ్యో చల్లారిపోయిందమ్మా. మళ్ళీ వేడిచేయమంటావు" అంది జానకి

"ఏమి ఉడుగ్గుందమ్మ చాయ్" అని ఊదుకుంటూ టీ తాగింది లక్ష్మి.

"కార్డు రెన్యూవల్ అయిందా లక్ష్మి"

"అవ్. అయిందమ్మ. కానీ ఏవి లాభవమ్మ. పెతి సొవ్వచ్చరం రెన్యూల్ జేయిస్తనే వున్న గాని ఇంతదన్క ఉద్యోగవే రానేదు"- నిట్టూర్చింది లక్ష్మి.

"గవర్మెంటుద్యోగం వస్తే మంచిగుంటది. ఓపిక లేనప్పుడు ఒకళ్ళు సూస్తరా లేదా అనే భయ్యం లేకుండా"

లక్ష్మికి పెళ్ళయిన ఐదేళ్ళకే పుట్టిన ఒక్కగానొక్క బిడ్డ, భర్త చనిపోయారు. భర్త ఎలా చనిపోయాడంటే వివరంగా చెప్పలేదు. 'బీమార్ అయింది. దవఖానకి తీసుకుపోయినం. వారం రోజులు తిరగబట్టినం. అయినా బతకలా' అంటుంది. పుట్టిన బిడ్డ కూడా అతిసారతో చనిపోయాడు.

"మళ్ళీ పెళ్ళి చేసుకోకూడదా లక్ష్మి?"

"సేసుకుంటే బానే వుంటదమ్మ. కానీ మా నాయన వద్దంటడు. మొన్న మీ యింటికి సున్నం కొట్టటానికి మాట్లాడవెట్టిన సూడు నర్సిమ్మని... వాడి పెండ్లాం ఒళ్ళు కాలి సచ్చిపొయ్యింది. ఆడు జేసుకుంటనంటున్నాడు. కానీ, మా నాయన జెయ్యదమ్మ. ఆడేమో ఒక్కటే అడగబట్టిండు. ఆడూ మా బస్తీవోడే మంచిగనే అగిపిస్తడు. ఏమో రేపటి సంది ఏదెట్లయితదో అనుకుంట. ఏవి సెప్పలేకపోతండ. మా నాయన ముందుకొచ్చి జేస్తే బాగుంటది. కాదని జేసుకుంటే, రేపేవయినా ఒక్కళ్ళూ రారు" వివరించింది లక్ష్మి.

**మానం పద్మజ**

"మంచివాడే అనిపిస్తే చేసుకోవటమే లక్ష్మి. ఇంకా ఎంతో జీవితం ముందుంది. అమ్మానాన్న నీకు ఎంతకాలం తో ం టారు. నీకంటూ ఒక మనిషి వుండాలి కదా. నన్నడిగితే మంచివాడని నమ్మకం కుదిరితే, పెళ్ళి చేసేసుకో" సలహా ఇచ్చేసింది జానకి.

"గట్ల సెయ్యొచ్చు గానీ, నేను పెండ్లి జేసుకుంటే, గిప్పుడు నేనుంటున్న ఇల్లు నా ఆడబిడ్డకి పోతది కదా! నర్సిమ్మకి ఇల్లు లేదు. పెండ్లయితే ఇల్లు వదులుకోవాల్సి వస్తది కదా. గిప్పుడయితే ఒక్క గదిలో నేనుండి, రెండుగదులు అద్దెకిచ్చిన. తిన్నా తినకపోయినా నా యింట్లో నేనుంటే అడిగేటోడు లేదు. పెండ్లయితే నేనే అద్దెకుండాల్సిన అగత్యం అయితది. గియ్యన్నీ సూసుకుని సేసుకోవాల్న గదమ్మ"

"నువ్వుంటున్న ఇల్లు నీ ఆడబిడ్డకెందుకు పోతుంది. ముందు నాకు అది చెప్పు"

"అది సచ్చిన నా పెనిమిటి పేరుమీద పట్టా ఇచ్చినరు. ఆయన సచ్చినంక నాకు వచ్చింది. నేను పెండ్లి జేసుకుంటే నాకు భాగం వుండదంటకదమ్మ. అది ఆడబిడ్డకి పోతదంట. గట్ల నా ఆడబిడ్డే సెప్పింది. సేసుకోవాల్నంటే పెండ్లి సేసుకో. నేనేమి అడ్డుజెప్ప కానీ ఇల్లు మాత్రం నీకు రాదు అంది. ఏదో ఒకటే కుదర్తది. మంచిగ ఆలోచించి తేల్చుకో అంది. గంతేకదమ్మ. సచ్చినోడు పేరు మీద నేనున్నంతకాలంగా ఇల్లు నాదయితది గానీ, పెండ్లి జేసుకుంటే నాకు అయితదా"- అమాయకంగా అడిగింది లక్ష్మి.

"నీ ఆలోచన తప్పు లక్ష్మి. నీ భర్త చనిపోయిన తర్వాత ఆ ఇంటి మీద నీకే పూర్తి హక్కు వుంది. అది నీ ఆడబిడ్డకి ఎంతమాత్రం చెందదు. ఆ ఇల్లు వాళ్ళ అమ్మానాన్న ఇచ్చింది కాదుకదా. గవర్నమెంటు మీకిద్దరికీ ఇచ్చింది. మీ ఆయన పేరు మీద ఇచ్చారు కాబట్టి, నీ ఆడబిడ్డ అట్లా అడుగుతుంది గానీ అది నీ పేరు మీద ఇచ్చుంటే అడిగేదా!"

"గప్పుడెందుకడుగుద్ది"

"మరి, ఇల్లెవరికోపోతుందని చెప్పి పెళ్ళిచేసుకుంటానని ముందుకొచ్చిన వాడ్ని వదులుకోకు. అయితే ఇంకోటి కూడా ఇక్కడ చూసుకోవాలి నువ్వు. బాగా చూసుకోగలడనే నమ్మకం ఏర్పడిన తర్వాతే చేసుకో. తొందరేం లేదు. బాగా ఆలోచించుకుని నిర్ణయం తీసుకో"

సాలోచనగా చూసి, ఇంకేం మాట్లాడకుండా పని పూర్తిచేసుకుని, "రేపు బట్టలు నానబెట్టు. పొద్దుగాలే వస్త" అని చెప్పి వెళ్ళిపోయింది లక్ష్మి.

రెండో రోజు పొద్దున్నే లక్ష్మి వస్తుందని బట్టలు నానబెట్టి, గిన్నెలు బయటవేసి వంట చేసుకోసాగింది జానకి. వంటయిపోయింది. పిల్లలు స్కూలుకి, భర్త ఆఫీసుకి వెళ్ళిపోయారు. అయినా లక్ష్మి జాడలేదు. అనవసరంగా బట్టలు నానపెట్టాను అని విసుక్కుంటా పని పూర్తి చేసుకుంది జానకి. ఆ రాకపోవటం రాకపోవటం లక్ష్మి మూడు రోజుల వరకు రాలేదు. మూడో రోజు సాయంత్రం జానకి లక్ష్మి వాళ్ళ బస్తీ వైపు వెళ్ళింది- లక్ష్మికేమయిందో తెలుసుకుందామని.

లక్ష్మి ఇంటి ముందు పెద్ద పంచాయితీనే జరుగుతోంది. కుటుంబ సభ్యులందరు బయటే కూర్చున్నారు. దూరం నుంచీ జానకిని చూసి, లక్ష్మి నాన్న రోడ్డు మీదికొచ్చాడు. "అమ్మ! లక్ష్మికి పేణం బానేదు. రేపటి సంది పంపిస్త" అని చెప్పాడు. ఇక ముందుకు వెళ్ళే చాన్స్‌లేక వెనుదిరిగింది జానకి.

తర్వాతి రోజు లక్ష్మి రాలేదు కానీ, లక్ష్మి చిన్నతనంనుంచి చేరదీసిన రేఖ వచ్చింది. భర్త, పిల్లవాడు చనిపోయిన తర్వాత, పక్కింట్లో వుండే యాదయ్య నలుగురి కూతుళ్ళలో చిన్నదయిన రేఖని చేరదీసింది లక్ష్మి. 'దాన్ని సాకి, పెండ్లిజేస్త' ననేది. రేఖ ఇప్పుడు తొమ్మిదో తరగతి చదువుతోంది. లక్ష్మికి అప్పుడప్పుడు సాయంత్రం పనుల్లో, ఆదివారాల్లో సాయంగా వచ్చేది.

"ఏం రేఖ నువ్వొచ్చేవు?"

"లక్ష్మి పంపిందమ్మ. వాళ్ళింట్లో ఒకటే రచ్చ చేస్తున్నారు. వాళ్ళ అక్క కొడుకుని పెంచుకోవాలట. ఆ సురేష్‌గాడు ఒత్తి చుప్పనాతోడమ్మ. నేను పెద్దమనిషయినప్పుడు పిన్ని నాకు కమ్మలు, వెండి పట్టాలు తీసిచ్చిందని ఒక్కటే గొడవ చేసి, కొట్టటానికొచ్చిండు. అసుమంటోడ్ని ఇప్పుడు పెంచుకోవాలంట. ఈ మూడు రోజుల్నించి ఆడ్ని లక్ష్మి ఇంటి దగ్గరే పెట్టారు. లక్ష్మి వాడ్ని చదివియ్యాలంట. ఆడ్నే చూసుకోవాలంట. ఇంతకాలం నన్ను పెంచుకుంటానంది. ఇప్పుడేమో వాళ్ళ వాళ్ళు గొడవ చేస్తే, ఆడ్ని దగ్గర పెట్టుకుంది" అని చెబుతూ పనిచేసుకోసాగింది రేఖ. రెండు రోజులు రేఖే వచ్చి పనిచేసి వెళ్ళింది. మొత్తం మీద ఒక వారానికి తిరిగి లక్ష్మి పనిలోకి వచ్చింది.

"ఏం లక్ష్మి మీ ఇంటి పంచాయితీ అయిపోయిందా? ఇంతకీ దేని గురించి గొడవంతా"- అడిగింది జానకి.

"ఆ! పంచాయితీనా పాడా, ఆడొచ్చి పెండ్లి జేసుకొంటానని మా అయ్యనడిగిండు. దానికే ఈ రచ్చంతా"

జరిగిందంతా గుర్తుతెచ్చుకోసాగింది లక్ష్మి...

"నువ్వేం సప్పుడు సెయ్యకుంటే, ఆడొచ్చి నన్నిట్టడిగేవోడా. నువ్వు సులాగ్గా అగ్గుడ్డంతో సీదా నా దగ్గరకొచ్చి అడగబట్టిండు. ఇది నువ్విచ్చిన సులకన కాదా" ఆమె తండ్రి నిలదీశాడు.

"నాకేం తెల్వదు. వాడు ఇష్టవేనా అని అడిగిండు. ఏవో మా అయ్యనడుగు అన్న. గంతకంటే ఇంకేం నేదు. ఏదో నా మీదికి దూకుతుండావు" అంది లక్ష్మి.

"గదో గదే నేను జెప్పేది. అడిగిన్నాడే

సెప్పు తిస్కోనుంటివి నా కొడ్కుని. అయినా నీకేం తక్కువయ్యిందే గిట్ల పెండ్లి ఆలోచన జేస్తున్నవ్. కష్టం జేసుకుంటన్నవ్. మంచిగ నీ ఇంట్లో గమ్మున వుంటన్నవ్. అయిపోయిందేదో అయిపోయె. గింతే రాసిపెట్టుంది అనుకోవాల. గమ్మునుండాల. అక్క బిడ్డలు నల్గురుండారు. ఒకడ్ని నీ కొడుకనుకో. ఆడ్ని సదివించు. పెంచి పెద్దజేయి. నీ ముసల్తనానికి ఆడే నీ తోడయితడు. అయినా నీకు పెండ్లి జేయలేక కాదే, గిప్పుడు ఎవడికో ఇచ్చి పెండ్లి జేసినానే అనుకో, ఆడు తాగుబోతో, తిరుగుబోతో అయితే... ఆలోసించినవా? రేపటినాడు ఆడు అట్టిట్టయితే ఆడ్ని, ఆడి కూతుర్ని కూడా నువ్వే సాకాల. నీ వొక పేణానికి ఇద్దరు తోడు. ఆడికా ఇన్ను లేదు. ఆడు కష్టపడినా వచ్చిన పైసలు గాడి బిడ్డ పెండ్లి జేయటానికే సరిపోతయ్యి. నీ కట్టం నీకెప్పుడయినా తప్పదు. గసుముంటప్పుడు పేణానికి సుఖం లేని పెండ్లి ఎందుకు సేసుకోవాల. పెండ్లయితే వున్న ఇంటోనుంచి ఆడబిడ్డ తరుముతది. ఇల్లు ఆకిలి లేకుండా మిగుల్తవు. అయినా ఆడు కూడా నీకిల్లున్నదనే సూస్తన్నాడు. పెండ్లయితే గా ఇల్లు కూడా దక్కదు. ఆడు నిన్నెట్ల సూసుకుంటడో తెల్వదు. అయినా గింత వయసు అవ్వనే అయింది. అక్కగ్గూడా ఇన్ను నేదాయె. అక్క కొడ్కుని సేరదియ్యి. నీకు తోడుంటడు. నీ ముసల్తనానికి ఎట్లుండాల అనే బయ్యం వుండదు. ఆడే నిన్ను సూసుకుంటాడు. ఇల్లు కూడా నువ్వున్నంతకాలం వుంటది. తర్వాత ఆడికయితది. ఇంటిని ఎవడో దారినిపోయేటోడు అనుభయించటం కంటే నీ తోటి బుట్టినోళ్ళు అనుభయిస్తారు"



-ఏకపక్షంగా చర్చ ముగించాడు లక్ష్మి తండ్రి.

"గంత గడ్డం వుచ్చుకోని అడగాల్సిన పనిలే. నా బిడ్డల్ని నేను దానికోసం గన్ననా. నా బిడ్డలు నాకు ఎక్కువేం గాదు. దానికి సేతకాదంటే ఒంటికాయ శొంటి కొమ్మునా దాన్నట్టే వుండమను. కన్నదాన్ని గామాత్రం సదివించుకోనేకనా? ఏదో దానికెవరూ లేరు, తోడుగుంటడ్లే అనుకుంటే తెగ నీల్గతంది" అని ఆడిపోసుకుంది అక్క.

"మీ నాన్న అట్ల మాట్లాడటం తప్పు కాదా లక్ష్మి. అంత పెద్దాయన నీ భవిష్యత్తు ఆలోచించి పెళ్ళిచేయాల్సింది పోయి, ఆస్తి ఎక్కడికి పోవద్దని ఆలోచిస్తున్నాడు. నీకు వయసేమంత అయిపోయిందని. ఇప్పుడ్నించే ఎవరి మీదో ఆధారపడి ఎందుకు బతకాలి. నీ బతుకు నీది కాకుండా ఎందుకు చేసుకుంటావు. పెళ్ళి చేసుకున్నవాడు చూస్తాడన్న గ్యారంటీ ఏంటని మీ నాన్న అడుగుతున్నాడు. మరి నువ్వు పెంచుకునే ఆ పిల్లవాడు రేపటినాడు నిన్ను చూస్తాడన్న గ్యారంటీ ఎవరు ఇస్తారు. మీ అమ్మానాన్న ఎంతకాలం వుంటారు. మీ అక్క, తమ్ముళ్ళకి వాళ్ళవాళ్ళ కుటుంబాలు వాళ్ళకున్నాయి. ఆ పిల్లవాడు సురేష్ ఇప్పటికే నీమాట వినడని చెప్పావోసారి. ఆలోచించుకో మరి..." అంతా విన్న తర్వాత తన అభిప్రాయం చెప్పింది జానకి.

"గవ్మా, ఆడు రేఖని ఇప్పటికే బతకనీడు. గా పిల్లని నేను పెంచుకుంటానని సిన్నప్పుడే సెప్పిన. పయివేటుకి డబ్బులు లేవంటే, ఇద్దామనుకున్నా. కానీ తెల్సిందంటే మా వాళ్ళు దాన్ని బతకనీరు. అందుకనే రేఖని కూడా దగ్గరికి తీట్లేదు ఆళ్ళకి భయపడి. గా పిల్లని సిన్నప్పట్నించి ఆశ పెట్టిన. గిప్పుడు నడుమ వదిలేసిన. అదేమో నీకు నీ చుట్టాలే ఎక్కువ అంటది"

"అదుగో. మరందుకే చెప్తున్న. వాళ్ళ మీద వీళ్ళ మీద ఆధారపడి నిర్ణయం తీసుకోకు. నీ జీవితానికి ఏది మంచిదో, ఏది కాదో వాళ్ళందరికంటే నీకే బాగా తెలుస్తుంది. నర్సిమ్మ మంచివాడేనని నమ్మకం కుదిరితే, రెండో ఆలోచన లేకుండా పెళ్ళి చేసుకో"

ఇంతకాలం ఎవ్వరి కోసం తన యవ్వనం, ఆలోచనలు, కోరికలు, ఆశలు ఈ నాలుగ్గోడల మధ్య బంధీ చేసింది. ఇప్పుడు ప్రాణం బాగోలేకపోయేసరికి తనకంటూ ఎవరు మిగిలారు. ఎడతెగని ఆలోచనలతో మనిషి పిచ్చిపట్టినట్లు తయారయ్యింది

"పెండ్లి జేసుకుంటే మా నాయిన ఇగ ఇంటికి రానీడమ్మ. ఉన్న ఇల్లు ఆడబిడ్డకి పోతది. రెక్కల కష్టం తప్పదు. ఎంత కష్టపడినా సొంతిల్లు కట్టుకోలేం. ఆడికి ఇల్లున్నా గింత ఆలోచించేదాన్ని కాదు" అని పనిచేసుకోసాగింది లక్ష్మి.

"నువ్వనుకుంటున్నట్టు అది నీ ఆడబిడ్డకి పోదు లక్ష్మి. వాళ్ళ అమ్మ వుండి వుంటే అప్పుడు విషయం వేరేగా వుండేది. పెళ్ళయిపోయిన తర్వాత నీ ఆడపడుచుకి అందులో హక్కులేదు. పెళ్ళి చేసుకున్నా నీ ఇల్లు నీకు కాకుండా ఎక్కడికీ పోదు"

"నువ్వేమో గిట్ల సెప్తున్నవ్ గానీ, మా బస్తీలో గిదంత నడవ్దమ్మ. పెండ్లి జేసుకుంటే గా ఇంట్లో నన్ను వుండనిస్తారు?... హయ్యో" అని పెదవి ఒక విరుపు విరిచి పనిలో పడింది లక్ష్మి.

తను చెప్పిందంతా లక్ష్మి బుర్రకెక్కకపోవడంతో హతాశురాలైంది జానకి. ఆ ఇంటి గురించి ఆలోచిస్తూ లక్ష్మి తన జీవితాన్ని పాడుచేసుకుంటుందని అనిపించింది. కానీ, తనింతకన్నా ఏమి చేయగలదు? లక్ష్మికి నచ్చచెప్పాలంటే ఆ దేవుడు దిగిరావాల్సిందే అనుకుని అప్పటికి ఆ విషయాన్ని వదిలేసింది జానకి.

సురేష్ని లక్ష్మి ఇంట్లోనే వుంచారు. వాడిక్కావాల్సినవన్నీ లక్ష్మి చూసుకుంటుంది. ఏ కొంచెం అటూఇటయినా వాడు ఒప్పుకోవట్లేదు. ఇదే మా అమ్మయితేనా అంటాడు. రేఖని లక్ష్మి దరిదాపులకి కూడా రానివ్వట్లేదు. చూస్తుండగానే నెలలు గడిచిపోతున్నాయి. నర్సిమ్మ లక్ష్మి నిర్ణయం కోసం ఇంకా ఎదురుచూస్తూనే వున్నాడు. లక్ష్మికి సురేష్ వ్యాపకమయితే వుంది కానీ మనశ్శాంతిగా లేదు. ఏదో అలజడిగా, ఆందోళనగా, కసిగా వుంటోంది.

ఎవరు ఏ కొంచెం అటూఇటూ మాట్లాడినా వాళ్ళమీద అవసరానికి మించి విరుచుకుపడుతుంది. "యేం బుట్టిందిరా దీనికి" అని కదిలిచ్చుకున్నవాళ్ళు తిట్టుకుంటూ వెళ్ళటం జరుగుతోంది.

బస్తీలో క్రిష్టయ్య దగ్గర లక్ష్మి ఐదు వేలకి చీటీ కట్టింది. అది వస్తే ఇంటికి నాపరాళ్ళు పరిపించాలని అనుకుంది. ఆ నెలతో చీటీ ఆఖరు. "ఆఖరుదే ఇయ్యి కిష్టయ్య" అని ముందే చెప్పింది.

తిరుమల వెళ్ళిరావాలని లక్ష్మికి చిరకాల కోరిక. లక్ష్మి పనిచేసే ఆచారిగారి అబ్బాయి పెళ్ళి తిరుమలలో పెట్టుకున్నారు. వియ్యపువాళ్ళు ఆచారిగారి తరఫు వాళ్ళకి తిరపతి రైల్లో ఒక బోగీ అంతా రిజర్వు చేశారు. పెళ్ళికి వచ్చే చుట్టాలందరినీ కలుపుకున్నా ఇంకా ఇద్దరికి టిక్కెట్లు మిగులుతున్నాయి. ఆచారిగారు లక్ష్మితో 'ఇంకొకళ్ళని తోడు తెచ్చుకో. రానుపోను టిక్కెట్లు నేను చూసుకుంటాను. నువ్వు పెళ్ళి చూసుకున్న తర్వాత చుట్టుపక్కల చూడాల్సినవన్నీ చూసిరా' అని చెప్పారు. ఇంట్లో చెప్పింది లక్ష్మి. మేము చూళ్ళేదంటే మేము చూళ్ళేదని అందరూ ప్రయాణమయ్యారు. దేవుడి కార్యం- ఎవర్నీ వద్దనకూడదనుకుని, చీటీ డబ్బులు ఐదువేలు తీసుకుని అందర్నీ తిరుమల తీసుకెళ్ళింది. తిరుమల నుంచి వచ్చిం తర్వాత నీళ్ళు తేడా చేసి లక్ష్మికి టైఫాయిడ్ పట్టుకుంది. ఓపికలేక ఇళ్ళల్లో పనులు మానుకుంది. "అది మహమ్మారమ్మ. పిల్లాడికొస్తే తట్టుకోలేడు" అని సురేష్ని వాళ్ళమ్మ తీసుకెళ్ళిపోయింది. లక్ష్మి తండ్రి వచ్చి ఆమెను తనింట్లో వుండమన్నాడు. తల్లి కూడా ఓపికున్న మనిషికాదు. తమ్ముళ్ళున్నారంటే ఎవరి పని మీద వాళ్ళు వెళ్ళిపోతారు. ఎక్కడైనా పడుకునుండేదే కదా అని తనింట్లోనే వుండిపోయింది లక్ష్మి. డాక్టర్ దగ్గరికి పోతే ఆ టెస్టని, ఈ టెస్టని చాలా రాశాడు. చేతిలో వున్న డబ్బు పుణ్యక్షేత్రాలకి అయిపోయింది. ఇప్పుడు తమ్ముళ్ళనడిగినా, 'మేమేమన్నా పెట్టమన్నావా నీ డబ్బులు. నువ్వే తీసికెళ్ళినవ్. పుణ్నెం నీకే వస్తది కానీ, మాకొస్తదా' అంటారు. అయినా వాళ్ళ అవసరాలు మానుకుని తనకేం పెడతారు. ఆలోచించుకుని మౌనంగా ఇంట్లోనే వుండిపోయింది లక్ష్మి. అద్దె డబ్బుల్తో కావాల్సిన బ్రెడ్డు కొనుక్కోసాగింది. ఒకరోజు పరిస్థితి వివరించి, రేఖతో పనిచేయించుకోమని చెప్దామని జానకి దగ్గరికి వెళ్ళింది లక్ష్మి. జానకి లక్ష్మి పరిస్థితి చూసి కంగారుపడింది. ఉస్మానియాలో తెలిసిన డాక్టరు అడ్రస్ ఇచ్చి వెళ్ళిరమ్మంది. మరీ అవసరమనిపిస్తే, పని రేఖతో చేయించుకుంటాను. నీకు పూర్తిగా తగ్గిన తర్వాతే వద్దువుగాని అని, ఒక వందరూపాయలు చేతిలో పెట్టింది.

లేని సత్తువ తెచ్చుకుని, సిటీబస్సుల్లో పడి ఒక్కర్తే ఈసురోమంటూ ఉస్మానియాకి వెళ్ళి వచ్చేది. ఎవరైనా తోడుంటే బాగుండనిపించేది. ఎవరి పనులు మానుకుని ఎవరొస్తారు. తల్లీతండ్రీ పెద్దవాళ్ళయిపోయారు. జానకి చెప్పిన డాక్టరు పుణ్యమా అని అక్కడ బాగానే చూసేవాళ్ళు. కానీ వెళ్ళిరావటమే కష్టమయింది. ఇంటికొచ్చాక కూడా ఈసురోమంటూ వుండాలి. ఓపికున్నా లేకపోయినా పనిచేసుకోవాలి. రోజూ సాయంత్రం తండ్రి వచ్చి 'మాత్తర్లు యేసుకున్నావా' అని వాకబు చేసి వెళ్ళేవాడు. రేఖ వచ్చి 'ఎట్లున్నవ్ పిన్నీ' అని రోజూ అడిగిపోయేది.

లక్ష్మిలో మళ్ళీ వెలితి మొదలయ్యింది. మందుల వల్ల, తీసుకున్న విశ్రాంతి వల్ల శారీరకంగా కొంచెం కోలుకుంది కానీ, మనసు అంతా అల్లకల్లోలం కాసాగింది. 'నేను ఎందుకిలా ఎవరికీ కాకుండా బతకాలి. అందర్నీ సూసుకోడానికి ఆళ్ళాళ్ళున్నారు. నేనేనా ఎవరికీ కాకుండా అయింది. ముసల్తనానికి తోడుంటడన్నారు. గా సురేష్గాడు సంపాయించే ఓపికున్నపుడే బీమార్ అయితే పక్కన లేకుండాపోయిండు. గా పోరన్ని నమ్ముకుంటే ఇంగ ఇంతే!'- ఆలోచనలు తెగవు... భవిష్యత్తు అయోమయం... జీవితానికి అర్థం లేదు. అర్థరాత్రి దాటినా నిద్రపట్టదు... గీయంటూ కీచురాళ్ళ మోత... వీధి కుక్కల అరుపులు... మధ్యమధ్యలో చుట్టుపక్కలుండే కాలనీల్లో నుంచి గూర్ఖా తలుపుల మీద చేసే కర్రశబ్దం. శబ్దాలతో, ఆలోచనల అలజడితో ఏ తెల్లవారుజామునో మగత నిద్రపోతుంది. అనారోగ్యం, ఒంటరితనం ఆమెను రెండు నెలలుగా పీల్చిపిప్పి చేస్తున్నాయి. ఈ కాస్త జ్వరానికే ఇట్లుంది. రేపటినాడు ఏదయినా పెద్ద బీమార్ అయితే నా పరిస్థితేంటని ఆలోచన... ఇంతకాలం ఎవ్వరి కోసం తన యవ్వనం, ఆలోచనలు, కోరికలు, ఆశలు ఈ నాలుగ్గోడల మధ్య బంధీ చేసింది. ఇప్పుడు ప్రాణం బాగోలేకపోయేసరికి తనకంటూ ఎవరు మిగిలారు. ఎడతెగని ఆలోచనలతో మనిషి పిచ్చిపట్టినట్లు తయారయ్యింది. ఎవ్వరితో ఏమి మాట్లాడదు. పది మాటలు మాట్లాడిస్తే ఒక్కదానికి సమాధానం

చెప్పుంది. ఇంట్లో కూడా వుండలేకపోతుంది. మళ్ళీ ఇళ్ళల్లో పనులకి పోవటం ప్రారంభించింది.

జ్వరం తర్వాత లక్ష్మి మారిపోయినట్లు అన్పించింది జానకికి. ఇంతకు ముందు పనిచేస్తూ గలగల మాట్లాడుతూ వుండేది లక్ష్మి. ఇప్పుడు ఏమన్నా పలకరించినా "ఏవో అమ్మ, తెల్వదమ్మ" అని నిర్లిప్తంగా వుండిపోతుంది. ఇంతకుముందు టీ తాగుతున్నంతసేపూ 'దాన్లో పాలు ఎక్కువయినవనో... పంచదార తక్కువయిందనో... ఈ రోజు మస్తుందమ్మ చాయ్' అంటూనో తాగేది లక్ష్మి. ఇప్పుడు టీ తాగుతో ఒక్కోసారి చూపు దేనిమీదో ఒకదాని మీద నిలేసి, ఎక్కడో ఆలోచిస్తూ వుండేది. "ఏం లక్ష్మి..." అని హెచ్చరిస్తే, చల్లారిన టీ పారబోసి వెళ్ళిపోయేది. లక్ష్మి ఇలా నిస్తేజంగా అయిపోయిందే అని జానకి బాధపడసాగింది.

ఆ నెల కాగానే ఒకటో తారీఖునే "జీతం ఇవ్వమ్మా" అని అడిగి తీసుకుంది లక్ష్మి. ఎప్పుడూ రెండో తారీఖునే జీతం. ఒకటో తారీఖునే అడగటంతో, ఏం అవసరమో ఏమో అనుకుని ఇచ్చింది జానకి. రెండో తారీఖు పొద్దున లక్ష్మి పనికి రాలేదు.

ఎదురింటి ఆచారిగారింట్లో వాకబు చేయటానికి వెళ్ళింది జానకి- 'మీకేమైనా చెప్పి వెళ్ళిందా' అని.

"లేదండీ... ఈ లక్ష్మితో పెద్ద తలనొప్పి అయింది. చెప్పాపెట్టకుండా మానేస్తుంది. అప్పటికీ ఒంట్లో బాగోలేదులే అని రెండుమూడు నెలల్నించి సర్దుకుంటూనే వున్నా. పోనీలే అని పిల్లల్తోటే పని చేయించుకుంటున్నా. ఇంకెవర్నన్నా పనికి పెట్టుకుందామంటే ఈ బస్తీవాళ్ళు తగాదాకొచ్చి వాళ్ళను పన్లోకి రానివ్వరు"- అక్కసు వెళ్ళగక్కింది ఆచారిగారి భార్య, బరబర గుమ్మం ఊడుస్తూ.

రాత్రి ఎనిమిది గంటలవుతుండగా రేఖ పరిగెత్తుకొచ్చింది.అమ్మా...అమ్మా...అని పిలిచి ఆయాసంగా నిలబడింది. జానకి బయటికి వచ్చింది.

"అమ్మా! పొద్దున్నే లక్ష్మి, నర్సిమ్మ యాదగిరి గుట్టకు పోయి పెళ్ళి చేసుకొని వచ్చారు. 'ఇంట్లో ఎట్ల అడుగుపెడ్తవో జూస్తగదా' అని వాళ్ళ ఆడబిడ్డ, 'శనిలాగ తగుల్కొని నా కూతురికి మందు పెట్టినవ్ గదరా' అని నర్సిమ్మని లక్ష్మి వాళ్ళ నాన్న తగులుకున్నారు. 'నా ఇంట్లోకి మీర్రానిచ్చేదేంటి?' అని లక్ష్మి పోట్లాడతంది. బస్తీ అంతా గొడవయితందమ్మా. పెళ్ళి మాట లక్ష్మి మీకు చెప్పి రమ్మనమని పంపింది. నేను జల్ది పోవాల" అని పరిగెట్టింది రేఖ.

ఆమె నిర్ణయం జానకికి సంతోషం కలిగించింది. బస్తీలో లక్ష్మి ఇల్లు నిలబెట్టుకోవడం కొంచెం కష్టమే. కోర్టుకు పోగలిగితే న్యాయం ఆమె పక్షానే వుండొచ్చు. కానీ, కోర్టుకు వెళ్ళే ఆలోచన, డబ్బు, తీరిక వాళ్ళకుండదు. తీర్పు అంతా బస్తీలోనే జరుగుతుంది. మంచో చెడో దానికే కట్టుబడతారు. అంతే ప్రాప్తమనుకుంటారు. లక్ష్మి పెళ్ళి బస్తీకి అభ్యంతరం కాదు. కానీ పెళ్ళి వల్ల ఆమె ఇంటిని నిలబెట్టుకోవచ్చు లేదా పోగొట్టుకోవాల్సి రావొచ్చు. లక్ష్మి తన జీవితానికి సంబంధించిన నిర్ణయాన్ని ఎవరి ప్రమేయం, ప్రోద్బలం లేకుండా తీసుకుని స్థయిర్యంగా నిలబడింది. ఆమె నిర్ణయం ఇంతకాలం ఇంటిని నిలబెట్టుకోవడం కోసం ఆమె జీవితాన్ని పణంగా పెట్టిన పెద్దరికాన్ని ప్రశ్నించింది. ఆమె ఆశల్ని, ఆకాంక్షల్ని అణిచివేసిన బంధుత్వాన్ని ఎండగట్టింది. జీవితం కన్నా ఆస్తి ముఖ్యమనే మనుషుల్ని ఎదిరించింది. ఫలితం ఏమయినా నిర్ణయించుకోవటంలో, నిలబడటంలో ఆమె జయించింది. ●

# మనోవేదనకు స్వస్తి చెప్పండి!

ఇరవై మూడేళ్ల కుమారి అర్మిత 'యాంగ్జయిటీ న్యూరాసిస్' కోసం వచ్చింది. ఆమె సైన్స్ విద్యార్థి. గత ఏడేళ్లుగా ఆమె ఒక రకమైన మానసిక వేదన (యాంగ్జయిటీ)ను అనుభవిస్తోంది. మనఃశాంతిని పొందడానికి ఆమె చెయ్యని ప్రయత్నం లేదు. ఎన్ని రకాలుగా యత్నించినా ఆమెలో చెప్పుకోదగ్గ మార్పు కనిపించలేదు. దాంతో ఆమె ఎన్ఎల్పి థెరపీకి వచ్చింది.

ఎన్ఎల్పి థెరపీ అంటేనే మందుల ఆవశ్యకత లేని మానసిక చికిత్స. ఇందులో మానసికంగా ఊహాప్రేరిత టెక్నిక్కులను ఉపయోగిస్తారు.వీటిలో ప్రతిఒక్కటీ శాస్త్రీయంగా ఎంతో విలువైందే కాక అనుభవ సిద్ధమైందికూడా. ఈ విషయంలో ఎంతో ప్రతికూల ఫలితాన్ని పొందిన వారు లేకపోలేదు. కోరుకున్న మార్పు వచ్చేదాకా మన ప్రవర్తనను తదనుగుణంగా కొనసాగించే ఒక రకమైన శాస్త్రీయ పద్ధతిని ఎన్ఎల్పి చికిత్సలో ఆచరిస్తారు. అలా కొనసాగించే ప్రవర్తనలకు కోడింగ్, డీకోడింగ్లను ఏర్పరచి కోరుకున్న మార్పును సదరు వ్యక్తిలో సాధిస్తారు. ఈ కోడింగ్లను గుర్తించే విధానంకూడా ఆ వ్యక్తి జీవితంలో ఎదుర్కొన్న ఏదేని క్లిష్టమైన అనుభవానికి సంబంధించిన అతడి ప్రవర్తన ప్రాతిపదికగా జరుగుతుంది. ఇలా ఈ కోడింగ్లను గుర్తించడంలోనే ఎన్ఎల్పి చికిత్సలోని ప్రధాన సూత్రాలు ఆధారపడి వుంటాయి. పంచేంద్రియాల సహాయంతోనే మన మెదడులోకి అన్ని రకాల సంకేతాలు వచ్చి చేరతాయన్న సంగతిని ఎన్ఎల్పి కూడా నమ్ముతుంది. వీటి నేపథ్యంతోనే చికిత్స కొనసాగుతుంది.



పి.టి.సుందరం
న్యూరో సైకాలజిస్టు

యాంగ్జయిటీ అన్నది ఒక మానసిక అస్థిరత. రానున్న కాలం గురించో, సంఘటన గురించో విపరీతమైన మానసిక వేదనకు గురవడమన్నమాట. మనసులోని ఈ వేదన దఫదఫాలుగా కలుగుతుంటుంది. ఈ ఫ్రీక్వెన్సీ బాగా పెరిగినప్పుడు 'యాంగ్జయిటీ న్యూరాసిస్' అంటారు.

గడచిన చిన్నతనంలో విపరీత మనోవేదనకు గురిచేసిన సన్నివేశాన్ని గుర్తుచేసుకోమని అర్మితకు అడిగాను. పదకొండేళ్ల వయసులో వున్నప్పుడు జరిగిన ఒక సంఘటనను ఆమె గుర్తుకు తెచ్చుకుని చెప్పింది. సిలిండర్ కనెక్షన్ను బుక్ చేయడంకోసం గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసుకు వెళ్లిన సందర్భంలో ఎదురైన అనుభవం అది. గ్యాస్ ఆఫీసువున్న కార్యాలయాన్ని చేరుకోవడానికి ఆమె సుమారు ముప్పావు కిలోమీటర్ దూరం మేర నడవాల్సి వుండింది.

ఆ రోడ్డుపైకి చేరుకుంది. రోడ్డుమీద ఎడమవైపున వున్న వాటిలో అయిదో కార్యాలయమే గ్యాస్ ఆఫీసు. ఒక్కో కార్యాలయాన్నే దాటుతూ రోడ్డుమీద ఎడమపక్కగా నడుస్తోంది. నాలుగో కార్యాలయాన్ని దాటగానే ఆమెకు మనసులో ఒక శంక పట్టుకుంది. 'ఆఫీ సులోకి వెళ్లగానే ఎవరైనా అనవసరమైన ప్రశ్నలతో వేదిస్తారేమో. అప్పుడేం చేసేది!?' ఇలా ఆలోచిస్తూనే ఆమె అయిదు, ఆరు కార్యాలయాలను దాటి ఏడో కార్యాలయం దాకా వెళ్లి తిరిగి వెనక్కి వచ్చి మూడో కార్యాలయంవద్దకు చేరింది. మళ్లీ ముందుకు కదిలింది. వెనక్కి వచ్చింది. ఇలా మొత్తం మూడుసార్లు ఏ కారణం లేకుండానే తిరిగింది. అయిదోసారి గ్యాస్ ఆఫీసులోకి దారితీసింది. అక్కడి క్లర్క్తో మాట్లాడి గ్యాస్ కనెక్షన్ బుక్ చేసి తాపీగా ఇంటికి తిరిగి వచ్చింది.

కళ్లు మూసుకుని ఒకసారి ఆ జరిగిన సంఘటనలోని సన్నివేశాలను నెమరు వేసుకోమన్నాను. వాటిని ఎన్ఎల్పి కోడ్ డిజిట్లోకి మార్చాలి. కోడ్ డిజిట్స్ ఈ కింది విధంగా వుంటాయి. మనసులోని సంఘర్షణల్ని 'ఇన్నర్ వాయిస్(ఐవి), ఇమాజినరీ పిక్చర్(ఐపి),ఇంటర్నల్ ఫీలింగ్(ఐఎఫ్)'గా క్రోడీకరించాలి. ఆ అమ్మాయి మానసిక వేదనకు గురైన ఆ సంఘటనను ఎన్ఎల్పి కోడ్లోకి ఇలా మార్చవచ్చు.

'గ్యాస్ ఆఫీసులోకి నేను వెళ్లగానే ఎవరైనా అనవసరమైన ప్రశ్నలడుగుతారేమో'-(ఐవి)

'బాధపెట్టే సంఘటనేదీ జరుగుతుందా లేదా తెలుసుకోవాలి'-(ఐఎఫ్)

'పరోక్షంగా కాసేపు అక్కడే తిరిగి పరీక్షించి చూడాలి'-(ఐవి)

'ఆఫీసులోపల కేవలం ఒకే మహిళ వుంది'-(ఐపి)

'ఇక లోపలికి వెళ్లి గ్యాస్ బుక్ చేసి రావచ్చు'-(ఐవి)

యాంగ్జయిటీ విధానం ఇలాసాగింది.

ఐవి-ఐఎఫ్-ఐవి-ఐపి-ఐవి

ఆ అమ్మాయి వివరించిన దాని ప్రకా రం నాటి సంఘటన సందర్భంగా ఆమె మనసులో నాటుకున్న భావనలను ఇలా విభజించవచ్చు. మానసిక ఆలోచనలు ఆమె మనసులో సుమారు 1 ఇంచ్ చుట్టుకొలతమేర విస్తరించగా, జంకు 30% వరకూ వుంది. మనోభావనల ప్రవాహం సెకనుకు 2 రెవల్యూషన్లమేర సాగింది. ఇది ఎన్ఎల్పి భాషలో 'రంగులేని' భావన.

ఇటీవలి కాలంలో ఎదురైన మరో మనోవేదన సంఘటనను గుర్తుకుతెచ్చుకుని చెప్పమని ఆమెను అడిగాను. 'లర్న్ ఇ-కామర్స్ అండ్ జావా' అన్న వ్యాపార ప్రకటనను వార్తాపత్రికలో చూసిన తర్వాత మనసులో ఏర్పడ్డ క్షోభను వివరించారామె. అప్పటి ఆమె మానసిక భావనల క్రమాలు 'ఇన్నర్ వాయిస్'(ఐవి) ఈ కింది విధంగా వున్నాయి.

1.లాభసాటే అయితే నేను చేరతాను(ఐవి)

2.కంప్యూటర్ల గురించి నాకు కనీస పరిజ్ఞానంకూడా లేదు. అలాంటిది అది నేర్వడంవల్ల నాకేమైనా ఉపయోగం వుంటుందా?(ఐవి)

3.టైమింగ్స్ నాకు సరిపోయేలా వున్నాయా?(ఐవి)

4.పైన పేర్కొన్నవన్నీ సరిపోతే సరే!(ఐవి)

5.ముందు స్వయంగా వెళ్లి పరీక్షించుకుంటాను(ఐవి)

ఆమె హైదరాబాద్లోని అమీర్పేట్ ప్రాంతంలో వున్న ఆ కంప్యూటర్ ఇన్స్టిట్యూట్ భవనాన్ని గుర్తించింది. కాంప్లెక్స్లోని రెండో అంతస్థులో ఇన్స్టిట్యూట్ వుంది. మెట్లు ఎక్కి ఆ అంతస్థుకు చేరింది. రెండో అంతస్థుకు చేరీచేరడంతోనే మొదలైంది ఆమె మనసులోని వేదన(యాంగ్జయిటీ). అక్కడి కారిడార్లోనే దాదాపు 20 నిమిషాలసేపు అటుఇటూ తిరుగుతూ వుండిపోయింది. ఆఫీసులోకి వెళ్లకుండానే దానిముందునుండే తిరుగుతూ లోపలికి పరీక్షగా చూసింది. లోపల వాతావరణం తనకు అనుకూలంగా వుందా లేదా! అన్నది తెలుసుకోవాలన్నదే ఆమె ప్రయత్నం. మొత్తంమీద ఆఖరకు ఆఫీసులోకి వెళ్లి తనకు కావలసిన సంగతులు అడిగి తెలుసుకుంది.

ఈ సమయంలోని ఆమె భావనలను కోడింగ్ చేసినప్పుడు మానసిక ఆలోచనల చుట్టుకొలత 2 ఇంచ్లుంది. అవి ఆమె గుండెలో క్లాక్వైజ్లోనే తిరిగాయి. అప్పుడు ఆమెలోని జంకు 30% శాతమే వుంది. ఆమె సంకోచం సెకనుకు 2 రెవల్యూషన్ల చొప్పున తెలుపు రంగును కలిగివుంది.

ఇప్పుడు ఆమె జీవితంలో జరిగిన అత్యంత ఆనందకరమైన సంఘటనను చెప్పమన్నాను. ఆ సంతోషకరమైన సంఘటనలోని మానసిక భావనలనూ కోడింగ్ చేశాను. ఆనందకరమైన ఆలోచనలు 3 ఇంచ్ల చుట్టుకొలత, సెకనుకు 1 రెవల్యూషన్తో ఎరుపు రంగును కలిగివున్నాయి.

ఈ స్థితిలో ఆమె కర్తవ్యం ఏమిటి?!

*(సమాధానం వచ్చేవారం)* ●